# "శాంతిస్థాపన"

"కన్నీటి కలం"

చలి. చినుకులు. చీకటి.

చీకట్ని కాస్తూ,—చినుకుల్ని మేస్తూ, — అక్కడక్కడా దీపాలు—ఆవేదనతో హృదయం మండిపోతోంది; ఉండుండి కృంగిపోతోంది.

ఏ 'సీ' లోనన్నా శాంతి ననుభవించమని, ముందు కీడ్చేస్తోంది 'మైండ్'.

'సహింపరాని ద్రోహం చేశావ్!' అంటోంది 'జాలి'.

'కాదు! గొప్ప త్యాగంచేశావోయ్!' కీర్తిస్తోంది నాలోని 'ఫిలాసఫీ.'

తీరని దాహం కాల్చేస్తోంది, నన్నూ—నాగుండెనీ.

గొంతుకలోకి గుప్పెడు నీళ్ళన్నా వెళ్ళడం లేదు.

ఎవరో తోసేస్తున్నట్టు ఈడ్చేస్తున్నా కళేబరాన్ని!—ఎక్కడికో తెలీదు!

దూరాన గంటలు ఎన్నో వినబడ్తోన్నై.

"....ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, ప—"

"ఆగు!—తాగావా ఏం"

తలెత్తాను. ఎదురుగా ఎఱ్ఱటోపీ.

'హుఁ!' అని అటు చూశా.

కళ్ళు భుగేల్ మన్నై.

కార్ ఆగింది.

ఎవర్ని చూడకుండా లోకాన్నుంచి నిష్క్రమిద్దామనుకున్నానో, ఆమూర్తే ఎదురౌతోంది! ఎల్లా!

"ఎందుకాపాడబ్బా!" ఆ ఎఱ్ఱటోపీమీద ఎంతో కోపం వచ్చింది.

పారిపోదామనే వుంది. కాని కాలు కదలడంలేదు.

సుపరిచిత సుగంధ సంపెంగ సౌరభ్యం ఆపేసింది గుండెని.

గులాబిరంగు చీరతెరల్లోంచి నవ్వుతో, నాట్యంచేస్తో వస్తోంది నావైపు—ఆమె.

ప్రకృతిలోని కారుణ్యమూ, నైర్మల్యమూ, సౌందర్యమూ, ఆమె అణువణువునా తొణికిసలాడ్తున్నాయా?

కనురెప్పవేయక అల్లా ఆమెను చూస్తోవుంటే, రెండు చేతుల్తోనూ, తీసికొని వెళ్ళి కార్లో తనపక్క కూర్చోపెట్టుకుని.... పక్కనేవున్న ఫ్లాస్క్ తీసి....వేడి పాలని గ్లాస్తో తాగించింది తనే!

తాగుతూన్నంతసేపూ నాకళ్ళు ఆమెవైపూ, వాడివైపూ, చూపుల్ని పంచుతున్నై.

ఆ ఎఱ్ఱటోపీ పాపం! జాలితోనూ, జెలసీతోనూ నావైపు చూస్తూ ఆరిపోయిన 'సిగార్'ని వెలిగించుకున్నాడు.

వాడ్ని ఆ'పోస్'లో చూసి—తలుపేసి, నవ్వూ నావైపు తిరిగింది.

అంతసేపూ ఆమెను చూస్తున్న నాకళ్లు,—బరువైన నా కళ్లు.—మరి వుంచుకొలేకపోయాయి.
నీళ్ళు జలజలారాలై!

"నువ్వల్లా చూడకు—నా గుండెని పిండేస్తోంది!"

"నువ్వల్లా నవ్వకు!—నా ఆవేదనని రవుల్కొల్పుతోంది!"

ఝుఝుమని చప్పుడుచేసుకుంటూ కార్ కదిలింది.

ఒక్కరూ మాటాడలేదు.

ఎంతదూరం తీసుకుపోతోందో!

గాలి రివ్వున వీస్తోంది. పాపం! ఆ ఖిల్లీకొట్టువాడి తడకల 'రూఫ్' ఎగిరిపోయింది.

గుడ్డిదీపం ఆరిపోయింది.

దూరాన 'హోర్' మని సంగీతం వినబడ్తో—రానురానూ దగ్గిరౌతోంది.

ఆగింది కార్; నావైపుతిరిగిచూసింది ఆమె.

చుట్టూ ఎవ్వరూలేరు.

దీపాల్ని ఆర్పేసింది.

గాలీ, చినుకులూ, సీ,—

చీకటీ, చిమ్మటా, కప్పలూ,—

అల్లరిచేస్తోన్నై!

నన్ను మరీ దగ్గరకు హత్తుకుని "ఏమిటమ్మా నీబాధ!" ఓదారుస్తో!

ఎంతో బరువుతీసేసినట్లయి, గబగబా క్రిందికి ప్రవహించై గుండెల్లో కన్నీళ్లు!

ఆ చీకట్లో ఎల్లా తెలుసుకుందో మరి!

చీర చెరగుతో కన్నీళ్ళని తుడిచి, మరీ మరీ అడిగింది, హృదయంతో।

"నన్నెందు కాదరిస్తావమ్మా। నేను హంతకుణ్ణి। తల నిమురుతోంది జాలిగా నవ్వుతూ।

"సరి। మరి భరించలేకపొయ్యాను. చివరికి ఈ పనిచేశాను. ఎంత కొట్లాడింది హృదయం. ఎన్నిరాత్రులు కన్నీరు కార్చాను. లోకాని కేంతెలుసు ఆ ఆవేదన। ఎందుకు తెలియాలే।ఆలోచించి ఎంత చించుకున్నాను 'మైండ్'ని। ఇంతకన్న ఏంచెయ్యగలడు ఈ అభాగ్యజీవి। నువ్వు చెప్పు!....అతను శాంతజీవి. కవితా కన్యకను ప్రేమించాడు. ఎన్నో ప్రేమాశయాలు, స్వర్ణసౌధాలు। నీలిమేఘాల నీడల్లో రంగులమేడల్ని కట్టుకున్నాడు. కానీ,—కాలం కర్మం కలిసొచ్చాయికావు। విధి—కఠినవిధి। తృంచేసింది ఆ ఆశయ కుసుమాల్ని అకాలంలో, వికృతంగానవ్వుతూ।। అడుగడుక్కీ ఆటంకం అతని జీవితంలో। అతని కవితాపథంలో కంకరరాళ్లూ। కారం ముళ్లూ। కలం పట్టగానే కాలికి సంకెళ్ళు। చుట్టూ చిచ్చులూ, బాధలూ, బాధ్యతలు। ఆదరంలేదు। ఆధారంలేదు।
మరి భరించలేకపోయింది ఆ సున్నిత కవిహృదయం। ఎన్నాళ్ళని అణుచుకోగలదు। లోకంలాగు వట్టి రాతిగుండెకాదు మరి। సున్నితమైన తంత్రులు 'స్ట్రెస్' చేసిచేసి తెగిపోయాయి। 'పిచ్చివాడు।' అని ఫక్కున నవ్వుతున్నారు ఇప్పుడు పైకిమాత్రం' అయ్యో పాపం మ్చ్।।" ...

చూడలేని పాపిష్టి తుపాను త్రుంచేసింది అతని'ప్రాణాన్ని।'

మ్రోడై మాడిపోయింది అతని గుండె.

అతని 'మైండ్' మండిపోయింది।

వుండేందికిల్లూ, తినేందుకి తిండీకూడా లే. లోకంచీకట్లో తణువుకుంటో వుంటే. దార్లో ముళ్ళు. మంటలూ. వెక్కిరింతలూ।

ఎన్నడూ నిద్రపోడు। ఏవో అరుపులూ, కరుపులూ। 24 గంటలూ చాలడం లేదు; అతని కాయాసం। ఇతర్లకి ప్రయాసం; అతన్ని చూస్తే అందరికీ నీరసం। పైగా అసహ్యం। ఇప్పుడు—।

బాగున్న రోజుల్లో అందరూ—ఎందుకవీ ఇప్పుడు?

లోకం పిల్లి వుందే బ్రతకలేక చస్తున్నవాడికి బెల్లంముక్క పెట్టదు। చచ్చిన శవాన్ని పువ్వుల విమానంలో ఊరేగిస్తుంది. రాంబందులు నయం।।

అతని అరుపుల్ని చూసి మరీ అసహ్యించుకుంటోంది। ఒక్కొక్క అరుపూ నా హృదయాన్ని రంపంతో కోసేస్తూ వుంటే। ఆ అరుపులు మెరిసే ఆ జాలికళ్ళల్లో ఆవేదనని చూసేందికి వుంటే నాకళ్ళు లోకానికి।....

ఎల్లా వెలిగేవాడతను। లలిత కళలన్నీ అతని కళ్ళల్లో గుళ్లని కట్టుకున్నాయి। ఏప్పుడూ సంగీతమే ఆ ఆలయాల్లోనుంచి।—అమర సంగీతం।—

ఎల్లా మారిపోయాడు।—మాడిపోయాడు।।
ఎండిపోయిన ఆ ఎడారి కళ్ళనీ
మండిపోతున్న ఆ పాడు రూపునీ,
చూస్తో వుంటే:—

చూడు। సగం పీక తెగినపక్షి పడదూ బాధ।
అంత బాధా అగుపిస్తుంది।
అప్పుడేం చేస్తావ్ నువ్వు? నీకూ హృదయం వుందికద।
మరి అతకలేని ఆ పీకని పీకేవూ।।।

అల్లా చెయ్యడం—పాపం అంటావ్!। పాపానికి అతీతులం కదూ మనం, ప్రేమికులం।:—

ఆల్లా చెయ్యడంకన్న గొప్పసాయం ఏమన్నా వుందా ఆ ప్రాణికి ఈ లోకంలో!

అదే చేశాను నేను। హంతకుణ్ణి అని నిందిస్తోంది లోకం చెట్టంత వాడివున్నావ్। ఎక్కడన్నా కష్టపడి పోషించకూడదూ।" ఆంటావా। తిండిస్తే తగ్గుతుందమ్మా మంట। ఇంతకీ అతని జీవితం అంత పాడైపోయినప్పుడు అతనింకా వుండి ఏం లాభం చెప్పూ। ఆతనికా ఆయాసం। ఆరని ఆవేదన, లోకానికి కంటకం।

అతని జీవితం అయిపోయింది। అవును। అకాలంలోనే। దానికి మనమేం చెయ్యగలం చెప్పూ జాలి పడేకన్న। మనకి జాలి పడేందికి హృదయమన్నా వుంది నయం।। అంటే మరెవ్వరికీ లేదని కాదు హృదయం। వున్నా వుపయోగించుకోరు, ఎక్కడ అయిపోతుందో అని। పిసినార్లు యీ స్వార్థపరులు।....

కొన్ని పువ్వులు మొగ్గలప్పుడే మాడిపోతాయి. కొన్ని అకాలంలో రాలి ధూళిలో కలసిపోతాయి; గాలితో ఎగురుతాయి గాని ఎంతవరకు। తిరిగి ధూళిలోకే। మరికొన్నింటిని మనుష్యులే తుంచేసి, పీల్చేసి, నల్పేస్తారు: ఏమిటో ఆనందం। వికృతానందం, విషానందం!! ఆపగలమా వాళ్ళని—ఊఁ।—మనంమాత్రం అల్లాచెయ్య వద్దు।....

చాల తొందరపడి చేశానంటావా ఆపని? మరి ఎన్నాళ్ళు చెప్పు। రోజురోజుకీ అతనికాబాధ। నాకూను! ఊళ్లోవాళ్ళు ఉమ్మేస్తున్నారు! ఎవ్వరికీ శాంతిలేదు ఒక్కప్రాణివల్ల? ఎవ్వరూ సాయం చెయ్యరు. అసహ్యించుకోడానికి అందరూ అధికార్లే! - లోకానికి బరువైపోయినప్పుడు మరి బతికి ఏం లాభం!—

ఎన్నాళ్ళల్లా అడుక్కుని తినడం! ఇంతా బ్రతుకు అందుకా! ఒప్పుకోదుసుమీ అంతరాత్మ। అన్నంపోసి ఎన్నాళ్ళు పోషించ మంటావ్ బాధని।

"రేపట్నుంచి మరివ్వలేం/" అని చెప్పేసింది ఆ ఇల్లాలు।

"మరి అక్కర్లే దమ్మా! ఇవాళతో మా ఆకలి సరి।"

'ఏమనుక్కుందో ఏమో! ధడేల్ మని తలుపేసింది! గడియ మఱచిపోయింది।।

ఆ అన్నంపళ్ళెం తెచ్చానా। తెస్తూంటే చేతులూ, కాళ్లూ వణకనారంభించాయి। తెలుస్తూ కష్టంకాదూ। ఎంత గుండె దిట్టం కావాలి। నువ్వు చెయ్యగలవా—ణీ।

ఆ పాలిపోయిన పెదిమలు నవ్వడానికి ప్రయత్నించాయి పళ్ళెంలో అన్నంచూసి। లేచేందికి ప్రయత్నించాడు కాని ఏదో ''బాధ" కదలనిచ్చిందికాదు .

చేతులూ, కళ్లూ ముందుకొచ్చాయి అందుకునేందికి। ఏదో ద్రోహం చేస్తోన్నానే అని బాధిస్తోంది। చూపులు బెదరనారంభించాయి. ఆ బాధలో, బెదుర్లో, పళ్ళెం వొరిగిపోయింది.

'అయ్యో।' అంది ఆ జీవి।

ఎంత ఆకలో పాపం। పడిపోయిన ఆ అన్నాన్నంతా తినేసింది తొందరతొందరగ।

ఖాళీ పళ్ళాన్ని చూస్తూ, కంచెంబుడినీళ్లూ తాగేసి హాయ్। అన్నాడు.

ఎంత శాంతించాయో ఆకలీ, బాధా।

"ఎంత మంచివాడవబ్బ।" అని నన్ను మరీ దగ్గరకు హత్తుకుని ఏదో చెప్పబోయ్యారు. ఆపేసింది దగ్గు అడ్డొచ్చి।....

ఆ కళ్లు అల్లానే మూసుకుపొయ్యాయి।

నాకళ్ళు ఇప్పటికీ మూసుకోడంలేదు। మరి హంతకుణ్ణేకదూ। శాంతి వుంటుందా చితిమీద దప్ప।।।....

ముఖాన్ని గుండెకి హత్తుకుని నుదుర్ని నిమురుతూ నా కళ్ళల్లోకి చూసింది.

తప్తాశ్రుకణాలు నా కళ్ళల్లో పడి,— హృదయావేదనాన్ని కడిగేసింది ఎంత శాంతంగా వుంది। అమ్మయ్య।।।"

"అబ్బ!" ఎంత గట్టిగా తగిలింది దెబ్బ। భుజంమీద.

కళ్ళు నులువుకుంటూ, భుజాన్ని తణువుకుంటూ, చికాకుతో, లేచేసరికి తల నిమురుతూ అగుపడ్డాడు అతను। కోపం కరిగిపోయింది ఆ ఎడారి ఒంటెను చూడగానే। కళ్ళుచెమ్మగిల్లాయి।

మరి నేనేకదూ ఒయాసిస్ ని!—

"ఏమిటి కావాలండీ నా—?"

"లోకం కాలిపోతోంది పేలిపోతోంది!—వెన్నెల మేడల్లో సంగీతం మండిపోతోంది। ఆకల్తో చస్తూ వుంటే కలలు కంటావేమిరా। వెళ్ళితే ఏదన్నా చల్ల నిది—ఊ। కదలవేం।!


# G. W. M. REYNOLDS' NOVELS

## BOLD TYPE EDITIONS.

**Mysteries of the Count of London** 17 vols. Rs. 17-0-0

| | | Rs. | As. | | | Rs. | As. |
|---|---|---|---|---|---|---|---|
| Joseph Wilmot | 8 vols | 5 | 0 | Necromancer | 3 vols. | 2 | 4 |
| Ellen percy | 8 ,, | 5 | 0 | Soldier's Wife | 2 ,, | 1 | 8 |
| Mary Price | 8 ,, | 5 | 0 | May Middleton | 2 ,, | 1 | 8 |
| Rye House Plot | 4 ,, | 3 | 0 | Faust | 2 ,, | 1 | 8 |
| Young Duchess | 4 ,, | 3 | 0 | Leila | 2 ,, | 1 | 8 |
| Rosa Lambert | 4 ,, | 3 | 0 | Robert Macaire | 2 ,, | 1 | 4 |
| Margaret | 4 ,, | 3 | 0 | Mary Stuart | 2 ,, | 1 | 0 |
| Loves of the Harem | 4 ,, | 3 | 0 | Seamstress | | 1 | 0 |
| Massacre of Glencoe | 4 ,, | 3 | 0 | Alfred | | 1 | 2 |
| Virgin's Kiss | 4 ,, | 3 | 0 | Grace Darling | | 0 | 10 |
| Canonbury House | 3 ,, | 2 | 4 | Young Fisherman | | 0 | 12 |
| Mysteries of Old London | 3 ,, | 2 | 4 | Stories Told by a Gendrame | | 0 | 10 |
| Pope Joan | 3 ,, | 1 | 12 | Mysteries of Paris by Eugene Sue | | 1 | 0 |

**ANANDA BODHINI OFFICE, P. B. NO. 167, MADRAS.**